# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 22-03-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

-  భారత్ భూటాన్ దేశాల మధ్య ఆధ్యాత్మిక సాంస్కృతిక అనుబంధం ఉందని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అన్నారు.
-  సీ విజిల్ ద్వారా వచ్చే ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు.
-  సార్వత్రిక ఎన్నికల నేపధ్యంలో అనుమానాస్పద లావాదేవీలకు సంబంధించిన కీలక సమాచారం అందించాలని బ్యాంకులకు కేంద్ర ఎన్నికల సంఘం సూచించింది.
-  లోక్ సభ, శాసనసభకు పోటీ చేసే అభ్యర్థుల మూడవ విడత జాబితాను తెలుగుదేశం పార్టీ ఈ రోజు విడుదల చేసింది.

=======================

భారత్ భూటాన్ దేశాల మధ్య ఆధ్యాత్మిక సాంస్కృతిక అనుబంధం ఉందని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అన్నారు. రెండు రోజుల పర్యటన కోసం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ రోజు భూటాన్ చేరుకున్నారు. భూటాన్ లో ప్రధానికి ఘన స్వాగతం లభించింది. ఈ పర్యటనలో భాగంగా థింపులో ప్రధాని నరేంద్ర మోదీ, భూటాన్ ప్రధాని షెరింగ్ టోబ్గే సమక్షంలో భారత్ భూటాన్ పరస్పర ప్రయోజనాలతో కూడిన పలు ఒప్పందాలను చేసుకున్నాయి. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోడీ మాట్లాడుతూ....

(వాయిస్ 30 సెకన్లు)

ఈ సందర్భంగా “ఆర్డర్ అఫ్ ది డ్రూక్ గ్యాల్పో” పురస్కారాన్ని భూటాన్ రాజు జిగ్మే ఖేసర్ నాంగ్యేల్ ప్రధాని నరేంద్ర మోడీ కి అందజేసారు.

==================

పెండింగులో ఉన్న ఫారం -7, 8లను ఈ నెల 26 నాటి కల్లా పరిష్కరించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పటిష్టంగా అమలుపరిచే

అంశానికి సంబంధించి అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో అమరా వతిలోని సచివాలయం నుండి ఆయన ఈ రోజు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రతీ పోలింగ్ స్టేషన్ లోనూ కనీస వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని అన్నారు. అలాగే, సి విజిల్ ద్వారా అందే ఫిర్యాదును సకాలంలో పరిష్కరించాలని కోరారు.

==================

సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న వేళ బ్యాంకులకు ఎన్నికల సంఘం కీలక సూచనలు జారీ చేసింది. బ్యాంక్ ఖాతాలో ఒక లక్ష కంటే ఎక్కువ డిపాజిట్ చేయడం లేదా విత్‌డ్రా చేయడం వంటివి ఎవరైనా చేస్తే జిల్లా ఎన్నికల అధికారికి సమాచారం ఇవ్వాలని బ్యాంకులను కోరింది. అలాగే, ఏదైనా బ్యాంకు ఖాతా నుంచి 10 లక్షల రూపాయల కంటే ఎక్కువ నగదు డ్రా చేస్తే దాని సమాచారాన్ని జిల్లా ఎన్నికల అధికారి, ఆదాయపు పన్ను శాఖ నోడల్ అధికారికి అందజేయాలని పేర్కొంది. బ్యాంకులన్నీ అనుమానాస్పద లావాదేవీల గురించి జిల్లా ఎన్నికల అధికారికి ఎప్పటికపుడు సమాచారం ఇవ్వాలని కోరింది.

==================

సార్వత్రిక ఎన్నికలలో లోక్ సభ, శాసనసభకు పోటీ చేసే అభ్యర్థుల మూడవ విడత జాబితాను తెలుగుదేశం పార్టీ ఈ రోజువిడుదల చేసింది. 11 అసెంబ్లీ స్థానాలతో పాటు 13 పార్లమెంట్ అభ్యర్థులను ఈ జాబితాలో ప్రకటించారు. ఈ సందర్భంగా టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు ఎక్స్ వేదికగా స్పందిస్తూ, రాష్ట్ర ప్రజల ప్రయోజనాలే ఏకైక అజెండాగా ఎన్డీయేలో చేరామని తెలిపారు.

==================

విశాఖలో మాదక ద్రవ్యాల అక్రమ రవాణా మీద కఠిన చర్యలు తీసుకుంటున్నామని నగర పోలీస్ కమిషనర్ రవి శంకర్ తెలిపారు. ఈ విషయంలో శాఖాపరంగా కట్టుదిట్టంగా వ్యవహరిస్తున్నామని పేర్కొన్నారు. విశాఖలో ఈ రోజు మీడియాతో ఆయన మాట్లాడుతూ, నిషేధిత మాదక ద్రవ్యాలతో పట్టుబడిన కంటైనర్ ఘటనపై సీబీఐ విచారణ చేపడుతోందని అన్నారు. ప్రైవేట్ కంటైనర్ టెర్మినల్ వ్యవహారం తమ పరిధిలోకి రాదని ఆయన తెలిపారు. కాగా, కస్టమ్స్ అధికారులు అడిగిన మీదటనే విశాఖ పోలీస్ కమిషనరేట్ నుంచి డాగ్ స్క్వాడ్ బృందాన్ని పంపామన్నారు.

==================

రాష్ట్రంలో కరవు మండలాల్లో తాగునీరు, ఉపాధి హామీ పనుల కల్పనపై ఈ రోజు వెలగపూడి రాష్ట్ర సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ .కెఎస్.జవహర్ రెడ్డి ఆయా జిల్లాల కలెక్టర్లు,పంచాయితీ రాజ్ గ్రామీణాభివృద్ధి, తదితర శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈసమావేశంలో పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశి భూషణ్ కుమార్, ఆశాఖ కమీషనర్ కె.కన్న బాబు, విపత్తుల నిర్వహణ సంస్థ డైరెక్టర్ ఆర్.కూర్మనాధ్ తదితరులు పాల్గొన్నారు.

విరామం

==================

ఈ రోజు ప్రపంచ జల దినోత్సవం. ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ 1992 డిసెంబరులో ఒక తీర్మానాన్ని ఆమోదించింది. దీని ద్వారా మార్చి 22 ను ప్రపంచ జల దినోత్సవంగా ప్రకటించారు. మంచి నీటి వనరుల సుస్థిర నిర్వహణపై అవగాహన కల్పించేందుకు ప్రతీ ఏటా ఈ రోజును జల దినోత్సవంగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. 2024 ఏడాదికి సంబంధించి సమృద్ధి, శాంతి కోసం నీరు అన్నది ఐక్యరాజ్యసమితి అంశంగా ఉంది. ఇదిలా ఉండగా, సుస్థిర నీటి నిర్వహణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు.

ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా సామాజిక మాధ్యమం ద్వారా ఆయన స్పందిస్తూ నీరు మన జీవితాలకు చాలా ముఖ్యమైనదని, ఈ విలువైన వనరును రక్షించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు.

==================

పశ్చిమగోదావరి జిల్లాలో అత్యధిక శాతం పోలింగ్ జరిగేలా ప్రతీ ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా స్వీప్ నోడల్ అధికారి జీసీహెచ్ ప్రభాకర్ చెప్పారు. జిల్లాలోని భీమవరం ఏరియా ఆస్పత్రిలో వైద్యులు ,వైద్య సిబ్బంది రోగులకు ఓటు వినియోగంపై ఈ రోజు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన ఆకాశవాణితో మాట్లాడుతూ, ప్రజలు అధికంగా ఉండే సంతలు, ఆస్పత్రులు తదితర ప్రాంతాలలో ఓటర్లలో అవగాహన కోసం సమావేశాలు నిర్వహిస్తున్నామన్నారు.

==================

పది పరీక్షల నిర్వహణపై అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి వి. అభిషేక్ ఆకస్మిక తనిఖీ చేసారు. కొత్త బల్లు గూడ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలలో జరుగుతున్న పది పరీక్షల విధానాన్ని ఈ రోజు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాస్ కాపీయింగ్‌కు అవకాశం లేకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు.

==================

కంట్రోలర్ జనరల్ ఆఫ్ అకౌంట్స్ ఎస్ఎస్.దూబే ఈ రోజు వెలగపూడి రాష్ట్ర సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ .కెఎస్ జవహర్ రెడ్డితో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఎస్ఎన్ఏ-స్పార్స్ పైలెట్ ప్రాజెక్టు తదితర అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో సంయుక్త కంట్రోలర్ జనరల్ ఆఫ్ అకౌంట్స్ హరీశ్ శ్రీవాస్తవ్, ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్ ఎస్ రావత్ తదితరులు పాల్గొన్నారు.

==================

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో చిత్తూరుజిల్లాలోని పలు సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పరిధిలో కేంద్ర సాయుధ బలగాలు ఈ రోజు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించాయి. చిత్తూరుజిల్లా ఎస్పీ పి.జోషువా ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం సాగింది. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పరిధిలో ఓటర్లకు ధైర్యం కలిగించడానికి, ఓటర్లను చైతన్యవంతులు చేయడానికి ఈ ఫ్లాగ్ మార్చ్ ను నిర్వహించాయని పోలీసు అధికారులు తెలిపారు.

==================

ఆంధ్ర ప్రదేశ్ యానంలో దిగువ ట్రోపో ఆవరణములో ఆగ్నేయ నైరుతి దిశ గా గాలులు వీస్తున్నాయని అమరావతిలోని భారత వాతావరణ శాఖ తెలిపింది. దీని ప్రభావంతో రాబోవు మూడు రోజులలో ఉత్తర కోస్తా దక్షిణ కోస్తా జిల్లాలలో వాతావరణం పొడిగా ఉండే అవకాశముందని పేర్కొంది. రాయలసీమ జిల్లాలో వేడి, తేమతో కూడిన అసౌకర్యమైన వాతావరణం ఒకటి లేదా రెండు చోట్ల ఏర్పడవచ్చునని వెల్లడించింది.

==================

భారత వాతావరణ సమాఖ్య అమరావతి అధ్వర్యంలో అమరా వతిలోని వాతావరణ శాఖ కె ఎల్ విశ్వవిద్యాలయం సంయుక్తంగా ప్రపంచ వాతావరణ దినోత్సవం 2024 ను ఈ రోజు నిర్వహించాయి . ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథి గా ఢిల్లీ ఐఐటీ ప్రొఫెసర్ సాగ్నిక్ డే పాల్గొన్నారు. మానవ ఆరోగ్యం పైన వాతావరణ ప్రభావం గురించి

ఆయన ప్రసంగించారు. భారత వాతావరణ సమాఖ్య అమరావతి చైర్మన్ ప్రొఫెసర్ ప్రసాద రావు మాట్లాడుతూ, భూమి ఆకాశం నీరు మనకి ఉన్న సంపద అని వాటిని కాపాడుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరి బాధ్యత అని గుర్తుచేశారు.

==================

కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం ఎక్కువ పోలింగ్ కేంద్రాలు ఉన్న ప్రాంతాలో ఓటరు సహాయక కేంద్రాలను ఏర్పాటు చేయాలని శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కలెక్టర్ ఎం. హరి నారాయణన్ అధికారులను ఆదేశించారు. కోవూరు లోని పలు పోలింగ్ కేంద్రాలను ఆయన ఈ రోజు అధికారులతో కలిసి పరిశీలించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ సహాయక కేంద్రం ద్వారా ఏ పోలింగ్ కేంద్రంలో తమ ఓటు ఉందనే విషయాన్ని ఓటరు తెలుసుకునేందుకు వీలవుతుందన్నారు.

==================

==================